నిబంధనల ప్రకారమే రిజర్వేషన్ నిర్ణయం

శెనార్తి మీడియా, మంచిర్యాల :

గ్రామపంచాయతీ ఎన్నికలు–2025 రిజర్వేషన్ ప్రక్రియను రాజ్యాంగం, పంచాయతీరాజ్ చట్టం, జనాభా ప్రాతిపదిక నిబంధనలకు అనుగుణంగానే పునఃపరిశీలించామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎస్సి, ఎస్టి రిజర్వేషన్లు వారి జనాభా కంటే తక్కువగా ఉండకూడదన్న ప్రమాణం, మొత్తం రిజర్వేషన్లు 50 శాతాన్ని మించకూడదన్న నియమాన్ని కచ్చితంగా అమలు చేశామని పేర్కొన్నారు. జిల్లాలోని 306 గ్రామపంచాయతీలు, 2,680 వార్డు స్థానాలకు రిజర్వేషన్ పునఃపరిశీలన పూర్తయిందని వివరించారు. మండలాల వారీగా నమూనా రిజర్వేషన్లలో ఎస్సి–ఎస్టి శాతం ఇలా ఉన్నట్లు తెలిపారు: భీమారం 50.35 శాతం, కాసిపేట 50.46 శాతం, కోటపల్లి 47.4 శాతం, మందమర్రి 49.8 శాతం, నెన్నెల 45.16 శాతం. ఈ మండలాల్లో ఎస్సి, ఎస్టి రిజర్వేషన్లు 50 శాతానికి చేరువ కావడంతో బిసి రిజర్వేషన్ల కేటాయింపు సాధ్యం కాలేదని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం తదుపరి ఆదేశాల మేరకు చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణ తప్పనిసరి

కలెక్టర్ కుమార్ దీపక్

శెనార్తి మీడియా, మంచిర్యాల :

విద్యార్థులు, యువత భవిష్యత్తును మాదకద్రవ్యాల ముప్పు నుంచి రక్షించడం అత్యవసరమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ స్పష్టం చేశారు. నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయంలో మాదకద్రవ్యాల నియంత్రణపై నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాల ఉత్పత్తి, రవాణా, విక్రయం, వినియోగాలను అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థుల్లో మత్తుపదార్థాల హానికర ప్రభావంపై అవగాహన కల్పించేందుకు ర్యాలీలు, వ్యాసరచన, చిత్రలేఖనం కార్యక్రమాలు నిర్వహించాలని, మానసిక నిపుణుల ద్వారా శిబిరాలు ఏర్పాటు చేసి స్పష్టమైన అవగాహన అందించాలని వివరించారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో డ్రగ్స్ రిహాబిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ఇన్ పేషెంట్ సేవలను మెరుగుపరచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. మందుల దుకాణాలు, ఆసుపత్రుల్లో ప్రత్యేక డ్రగ్స్ రిజిస్టర్ నిర్వహించడంతో పాటు వైద్యుల సూచన మేరకే మందులు విక్రయించాలని ఆదేశించారు. గురుకులాలు, వసతిగృహాలు, విద్యాసంస్థల ప్రహారీ, కారిడార్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.అక్రమ మద్యం, గంజాయి, సిగరెట్ల విక్రయాలపై పోలీసులు–రెవెన్యూ శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని, అవసరమైతే కార్డన్ సెర్చ్‌లు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. లైసెన్స్ లేని దుకాణాలను సీజ్ చేయాలని ఆదేశించారు.డీసీపీ భాస్కర్ మాట్లాడుతూ... ఈ ఏడాది జిల్లాలో మాదకద్రవ్యాలకు సంబంధించిన 55 కేసులు నమోదు చేసి 156 మందిని అరెస్టు చేసినట్టు తెలిపారు. 41 కిలోల గంజాయి స్వాధీనం చేశామని వివరించారు. మత్తుపదార్థాల రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చెక్‌పోస్టుల వద్ద టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలు చేస్తున్నాయని తెలిపారు. అనుమానాస్పద నిల్వలపై ప్రజలు వెంటనే డయల్–100కు సమాచారం ఇవ్వాలని కోరారు.డ్రగ్ ఇన్ స్పెక్టర్ జిల్లాలోని మందుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అనుమతులు లేని దుకాణాలపై చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

రంగపేట గ్రామ సీనియర్ నాయకుడు గోపు రాజిరెడ్డి మృతి

శెనార్తి మీడియా, మానకొండూర్ :

గోపు రాజిరెడ్డి(ఫైల్)

:మానకొండూర్ మండలం రంగపేట గ్రామ సీనియర్ నాయకుడు గోపు రాజిరెడ్డి అనారోగ్యంతో సోమవారం కన్నుమూశారు. ఆయన మరణ వార్తతో గ్రామస్తులు, అభిమానులు విచారం వ్యక్తం చేశారు.. గ్రామ అభివృద్ధి కోసం కృషి చేసిన రాజిరెడ్డి సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని గ్రామ ప్రజలు స్మరించుకున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి ముద్దసాని దామోదర్ రెడ్డికి సన్నిహితంగా మెదిలారు. గతంలో టీడీపీ గ్రామ అధ్యక్షులుగా, గ్రామ, ఆ పార్టీ మండల సీనియర్ నాయకులుగా గ్రామ అభివృద్ధికి కృషి చేశారు. అతని బౌతికాకయానికి వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీఎన్జీవోస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి హాజరై శ్రద్ధంజలి ఘటించారు. గ్రామ నాయకులు మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచులు గోపు గోపాల్ రెడ్డి, పావని శ్రీనివాసరెడ్డి, రుద్రవరం శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ లు గౌస్ పాషా, చెరుకు మల్లారెడ్డి, గ్రామ సీనియర్ నాయకులు గోపు సత్యనారాయణ రెడ్డి, గోపు ఆనంద రెడ్డి, రామిడి శంకర్ రెడ్డి, కొత్త కిషన్ రెడ్డి, గోపు మాధవ రెడ్డి, నాగుల కొమురయ్య, మారెళ్ల నాగిరెడ్డి, కొత్త రాంరెడ్డి, కొత్త సతయ్యనారాయణ రెడ్డి, కొత్త శంకర్ రెడ్డి, కొత్త రాజి రెడ్డి, కొత్త రవీందర్ రెడ్డి, కంకణాల రవీందర్ రెడ్డి, గోపు సాగర్ రెడ్డి, అనిరెడ్డి స మ్మిరెడ్డి వావిలాల శ్రీనివాస్ రెడ్డి, గుడా ల మహేందర్ వివిధ పార్టీల నాయ కులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని నివాళులు అర్పించి అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

అంతిమ యాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రసమయి



మానకొండూర్ మండలం రంగపేట గ్రామ సీనియర్ నాయకుడు గోపు రాజిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హాజరై బౌతికకాయానికి నివాళులు అర్పించారు. అతని కుమారులు గోపు అంజిరెడ్డి, గోపు ఈశ్వర్ రెడ్డి, గోపు శ్రీనివాస్ రెడ్డిలను ఓదార్చి సానుభూతి వ్యక్తం చేశారు. అతని వెంట మానకొండూర్ మాజీ జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్ గౌడ్, శంకరపట్నం మాజీ ఎంపిపి ఉమ్మెంతల సరోజన–సతీష్ రెడ్డి, ముంజంపల్లి మాజీ సర్పంచి రామంచ గోపాల్ రెడ్డి, పొలాడి రామారావు, మల్యాల్ రావు, శ్యామ్ రావు, గ్రామ సీనియర్ నాయకులు వేల్పుల కొమురయ్య, నాగుల ఆంజనేయులు, గోపు విష్ణు వర్ధన్ రెడ్డి, అగ్గి తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు చికిత్స అందించాలి

- రూ.4 కోట్ల విలువైన వైద్య పరికరాలను అందించిన కేంద్ర మంత్రి
- జిల్లా కలెక్టర్ తో కలిసి జమ్మికుంట, హుజూరాబాద్ ఆసుపత్రులను సందర్శన
- సీఎస్సార్ ఫండ్స్, సొంత నిధులతో మౌలిక సదుపాయాల కల్పనకు బండి సంజయ్ హామీ

వైద్య పరికరాలను అందజేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, కలెక్టర్ పమేలా సత్పతి

శెనార్తి మీడియా, హుజురాబాద్ :

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద రోగులను టెస్టుల పేరుతో ప్రైవేట్ ఆసుపత్రులకు పంపొద్దు. రూపాయి ఖర్చు లేకుండా పూర్తి చికిత్స అందించండి'' అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి జమ్మికుంట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సోమవారం సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎస్సార్ నిధులతో దాదాపు కోటి రూపాయల విలువైన ఈసీజీ మిషన్, అల్ట్రాసౌండ్ మిషన్, మల్టిపురా మానిటర్, ఆటోక్లేవ్, డయాథెర్మా మిషన్, అనెస్థిషియా వర్క్ స్టేషన్, ఈఎన్టీ హెడ్ లైట్, ఫెటల్ మానిటర్ సహా 15 అత్యాధునిక వైద్య పరికరాలను అందజేశారు. వీటి సేవలను కలెక్టర్, బండి సంజయ్ ప్రారంభించారు.హుజూరాబాద్, హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులను కూడా కేంద్ర మంత్రి పరిశీలించారు. తన నియోజకవర్గంలో విద్య, వైద్య రంగాల పురోగతికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికే పదో తరగతి చదివే 20 వేల మంది విద్యార్థులకు ఉచితంగా బ్రాండెడ్ సైకిళ్లు అందించిన విషయం గుర్తు చేశారు. త్వరలో 9వ తరగతి విద్యార్థులకు కూడా సైకిళ్లు పంపిణీ చేయనున్నట్టు వెల్లడించారు.తదుపరి విద్యా సంవత్సరం ఆరంభంలో 1–6 తరగతుల విద్యార్థులకు స్కూల్ బ్యాగ్, నోట్బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, జామెట్రీ బాక్స్, వాటర్ బాటిల్‌తో కూడిన కిట్లను మోదీ గిఫ్ట్ పేరుతో అందించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. ఇందుకు సీఎస్సార్ నిధులతోపాటు వ్యాపారులు, దాతల సహకారం తీసుకుంటున్నట్టు వివరించారు.జనరల్ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు చెప్పారు. ఎన్ఎండీసీ సీఎస్సార్ నిధులతో రూ.4 కోట్లు సమకూర్చి వేములవాడ, జమ్మికుంట, హుజూరాబాద్, హుస్నాబాద్ ఏరియా ఆసుపత్రులకు అవసరమైన పరికరాలను అందజేశారని వివరించారు. గతంలో కరీంనగర్ జిల్లా ఆసుపత్రికి తన బర్త్‌డే కానుకగా రూ.3 కోట్ల విలువైన అంబులెన్సులు, ఎక్స్‌రే మిషన్ సహా పరికరాలు అందించిన సంగతి గుర్తు చేశారు. వాటి మెయింటెనెన్స్ ఖర్చును కూడా తానే భరిస్తున్నట్టు పేర్కొన్నారు

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటరిగా బరిలోకి

- సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

శెనార్తి మీడియా, గన్నేరువరం :

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ పార్టీ ఒంటరిగా బరిలోకి దిగనున్నట్లు జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ప్రకటించారు. గన్నేరువరం మండలం హన్మాజీపల్లి గ్రామంలో నిర్వహించిన సీపీఐ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలందరూ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు పట్టుదలగా కృషి చేయాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది సీపీఐ మాత్రమేనని, ఎర్ర జెండా ఎప్పటికీ ప్రజలకు అండగా ఉంటుందని తెలిపారు. ప్రతి గడపకు చేరి ప్రజల్లో చైతన్యం పెంపొందించాలని సూచించారు. మండలంలో పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేస్తే మెజారిటీ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలు సీపీఐ ఖాతాలో చేరతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామాల్లో వార్డు సభ్యుల స్థానాలకు పార్టీ తరపున పోటీ చేసేందుకు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు కాంతలా అంజిరెడ్డి, మండల సహాయ కార్యదర్శులు కూన మల్లయ్య, పిప్పల కనుకయ్య, బోయిని మల్లయ్య, బోయిని తిరుపతి, కోతి సంపత్, కూన కిష్టయ్య, దాసరి చెంద్రయ్య, ఎండీ నయీమ్, బొమ్మకంటి అంజయ్య, చారి, రాజమల్లు, సంపత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలు ఉపేక్షించం

- పెద్దపల్లి జోన్ డీసీపీ భూక్యా రామ్‌రెడ్డి

శెనార్తి మీడియా, రామగుండం:

"చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదు" అని పెద్దపల్లి జోన్ డీసీపీ భూక్యా రామ్‌రెడ్డి స్పష్టం చేశారు. గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన సోమవారం సందర్శించారు.పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించిన డీసీపీ... బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, ఫిర్యాదులు వచ్చిన వెంటనే పరిష్కార చర్యలు ప్రారంభించాలని సూచించారు. స్టేషన్ పరిధిలో ఎక్కువగా నమోదయ్యే నేరాల స్వరూపం, సెక్టార్‌వారీగా ఎస్ఐల పనితీరు, రౌడీ షీటర్ల ప్రస్తుత చలనం, అనుమానితుల వివరాలను ఇన్‌స్పెక్టర్ నుండి తెలుసుకున్నారు.గంజాయి సహా ఇతర మత్తు పదార్థాల రవాణా–క్రయవిక్రయాలను కట్టడి చేయడానికి ప్రత్యేక నిఘా అవసరమని చెప్పారు. నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ కీలకమని, పట్టణంలో నిరంతరంగా పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు.తరువాత డీసీపీ గోదావరిఖని ఏసీపీ కార్యాలయాన్ని కూడా సందర్శించారు. స్టేషన్‌ల వారీగా నేర గణాంకాలు, సమస్యాత్మక ప్రాంతాల భద్రత చర్యలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.డీసీపీతో పాటు ఏసీపీ ఎం.రమేష్, సీఐ ఇంద్రసేనరెడ్డి, ఎస్ఐలు భీమేష్, రమేష్, అనూష పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు ఇవ్వాలి

శెనార్తి మీడియా, న్యూఢిల్లీ :

తెలంగాణ ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందుబాటులోకి రావాలంటే గౌరవెల్లి సహా రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులకు వెంటనే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ కార్యదర్శి తన్మయికుమార్ ను కోరినట్టు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఢిల్లీలో కార్యదర్శిని సెక్రటరీ కోఆర్డినేషన్ డా. గౌరవ్ ఉప్పల్ తో కలిసి ఆయన కలిశారు.ప్రభుత్వం చేపడుతున్న నీటిపారుదల ప్రాజెక్టులు, వాటికి పెండింగ్ లో ఉన్న అనుమతులపై వివరంగా చర్చించినట్టు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు 'వనశక్తి' తీర్పును వెనక్కి తీసుకోగా, న్యాయసలహా తీసుకొని అనుమతుల మంజూరు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తామని తన్మయి కుమార్ చెప్పినట్టు వివరించారు. తెలంగాణలో సాగునీరు విస్తరణకు కేంద్ర అనుమతులు కీలకమని, వీటితో అభివృద్ధి వేగం పెరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు.

26న జూడో ఎంపిక పోటీలు

శెనార్తి మీడియా, కరీంనగర్:

జిల్లా స్థాయి సీనియర్ జూడో పోటీలు ఈ నెల 26న కరీంనగర్ లోని ప్రాంతీయ జూడో హాల్ లో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వినయ్, ఎస్ దామోదర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపిన వారిని ఈ నెల 29,30న హైదరాబాద్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపించున్నట్లు వివరించారు. ఆసక్తి గల క్రీడాకారులు బుధవారం ఉదయం 8.30 గంటలకు ధ్రువీకరణ పత్రాలతో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 98494 31321 సంప్రదించాలని సూచించారు.

అండాలమ్మ కాలనీలో దాడి కలకలం

- మహిళ, వ్యక్తికి గాయాలు
- ఇద్దరిపై కేసు

శెనార్తి మీడియా, మంచిర్యాల:

అండలమ్మ కాలనీలో మధ్యాహ్నం జరిగిన దాడి ఘటనలో మహిళతో పాటు మరో వ్యక్తి గాయపడినట్టు పోలీసులు తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో కిరాణా దుకాణానికి వెళ్తున్న అలకుంట లక్ష్మీ హనుమాన్ ఆలయం వద్ద కు రాగానే దారంగుల రాజు, ధారంగుల శివ కలిసి కుంచపు రాజుపై రాళ్లతో దాడి చేస్తున్నట్లు ఆమె గమనించినట్టు చెప్పారు. లక్ష్మీ వారిని ఆపమని చెప్పడంతో పరిస్థితి మరింత విషమించిందని పోలీసులు వివరించారు. శివ లక్ష్మీ భర్త సాయిలును అడ్డుకుని, లక్ష్మీ చెంపపై కొట్టినట్టు తెలిపారు. దారంగుల రాజు ఆమె కుడి చేతి మధ్యవేలు కొరకడంతో వేలు విరిగినట్టు పేర్కొన్నారు. ఇదే సమయంలో కుంచపు రాజు తలలో రక్తగాయాలు అయినట్టు చెప్పారు. భర్త అలకుంట సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేర కు దారంగుల రాజు, ధారంగుల శివలపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

మానేరు వాగు చెక్ డ్యామ్ ఘటనపై సమగ్ర విచారణ

- కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం..
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ మరియు పోలీస్ కమిషనర్
- హైదరాబాద్ ఫోరెన్సిక్ నిపుణుల బృందంతో ఆధారాల సేకరణ.
- సహజంగా జరిగిందా లేక విధ్వంసమా అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం.

చెక్ డ్యాం స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ మరియు పోలీస్ కమిషనర్

శెనార్తి మీడియా, కరీంనగర్ :

చెక్‌డ్యామ్ దెబ్బతినడంపై పూర్తి స్థాయి విచారణ జరుపుతున్నామని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి–పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం స్పష్టం చేశారు. తనుగుల గ్రామ శివారులో మానేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్ దెబ్బతిన్న ఘటనపై సోమవారం వారు ప్రత్యక్షంగా స్థలాన్ని పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు.నవంబర్ 21 రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన సహజసిద్ధమేనా? లేక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ధ్వంసానికి పాల్పడ్డారా? అనే కోణంలో జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శాస్త్రీయ విచారణ ప్రారంభంహైదరాబాద్ ఫోరెన్సిక్ ల్యాబ్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్ రాజ్ బృందం, కరీంనగర్ క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్ ఇన్‌స్పెక్టర్లు రాజు, స్వర్ణజ్యోతి ఘటనా స్థలంలో నమూనాలు సేకరించారు. వీటిపై ప్రయోగశాలలో పరీక్షలు పూర్తి చేసి నివేదిక అందిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. బాధ్యులు ఎవరైనా తేలితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.ఈ పరిశీలనలో ఏసీపీ మాధవి, ఏసీపీ కృష్ణ, ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ గౌడ్, లక్ష్మీనారాయణ, ఎస్ఐలు శేఖర్ రెడ్డి, ఆవుల తిరుపతి, నీటి పారుదల శాఖ అధికారులతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.